## దేవుడు న్యాయశీలుడు & కరుణామయుడు

- పాపాలను క్షమించడానికి దేవుడు తన్నుతాను బలిపెట్టనవసరం లేదు. అలాగే ఎవరు పాపంతో పుట్టడం జరగదు.
- ప్రతివ్యక్తి వ్యక్తిగత ఆచరణలఆధారంగా దేవుడు తీర్పునిస్తాడు. ప్రతి వ్యక్తి తన స్వంత ఆచరణలకే జవాబు చెప్పుకోవలసి ఉంటుంది.
- దైవ విశ్వాసం, సదాచరణ, దైవభక్తి ద్వారా మాత్రమే మనిషి దేవుడి ప్రసన్నత పొందగలడు. జాతి, సంపద, సామాజిక హెూదాలవల్ల దైవప్రసన్నత లభించదు.

## దేవుడు మాత్రమే ఆరాధనలకు అర్హుడు

"అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించండి. ఆయనతో భాగస్వాములను చేర్చ కండి" (దివ్యఖుర్‌ఆన్ 4:36) అన్ని ఆరాధనలు, ప్రార్థనలు కేవలం అల్లాహ్‌కు మాత్రమే పరిమితమని ఇస్లామ్ బోధిస్తుంది. ఆయన తప్ప మరెవ్వరు ఆరాధనలకు అర్హులు కాదు. సమాధులు, విగ్రహాలు, సూర్యుడు, చంద్రుడు, పశువులు, ప్రవక్తలు, సాధువులు, దేవదూతలు, మతపెద్దలు, మతపండితులు ఎవరూ కాదు. ఇవన్నీ లేదా వీరందరూ సృష్టించబడ్డారు. పరిమితులు, బలహీనతలు ఉన్నవే అన్నీ. అందువల్ల అన్నీ అసంపూర్ణమే. కేవలం దేవుడు ఒక్కడే పరిపూర్ణుడు.

## ప్రత్యక్షంగా దైవారాధన

దేవుడికి భాగస్వాములు, మధ్యవర్తులు అవసరం లేదు. ప్రతి ఒక్కరు ప్రత్యక్షంగా తానే దేవుడిని ఆరాధించవచ్చు, ప్రార్థించవచ్చు. ఆయన్ను స్తుతించే వారిని, ఆయన్ను వేడుకునే వారినందరినీ ఆయన వింటాడు. విగ్రహాలు, మధ్యవర్తులద్వారా పరోక్షంగా ఆయన్ను వేడుకోవడం అంటే దేవుడి స్వచ్ఛత విషయంలో రాజీపడడమే అవుతుంది. ఆయన మాత్రమే ఆరాధనకు అర్హుడన్న విశ్వాసం విషయంలో రాజీ పడడమే అవుతుంది.

## దైవప్రవక్తలందరూ ఒకే దేవుని ఆరాధించాలని పిలుపు ఇచ్చారు

"మేము ప్రతి జాతిలోనూ ఒక ప్రవక్తను ప్రభవింపజేశాము. అతని ద్వారా అందరికీ ఇలా హెచ్చరిక చేశాము: 'అల్లాహ్‌ను ఆరాధించండి' మిథ్యాదైవాల ఆరాధనకు దూరంగా ఉండండి." (దివ్యఖుర్‌ఆన్ : 16 : 36)

దైవప్రవక్తలందరినీ దేవుడే పంపించాడని ముస్లిములు విశ్వసిస్తారు. ఈ ప్రవక్తలు, ఆదమ్, నూహ్, ఇబ్రాహీం, మూసా, ఏసుక్రీస్తు, ముహమ్మద్ (అందరికి శాంతి కలుగుగాక)... అందరూ ఒకే సందేశాన్ని తీసుకు వచ్చారు. ఒకే ఒక్క దేవుని ఆరాధించాలన్నదే ఆ సందేశం.

## దైవారాధనే జీవితలక్ష్యం

దేవుని ఔన్నత్యాన్ని గుర్తించడం, ఆయనతో ప్రత్యక్ష సంబంధాన్ని ఏర్పరచుకోవడం, ఆయన్ను ఒక్కడిని మాత్రమే ఆరాధించడం, ఇవి మాత్రమే జీవిత లక్ష్యాలు. ఇస్లామ్‌లో ఆరాధించడమంటే కేవలం ప్రార్థనలు ఉపవాసాలకు పరిమితమైన భావన కాదు. దేవుడికి ఇష్టమైన ప్రతి పని చేయడం ఆరాధనే. మంచి నడవడి కలిగి ఉండడం, నిజాయితీ, న్యాయం, సహనం, పేదవారికి సహాయపడడం ఇవన్నీ ఆరాధన క్రిందికే వస్తాయి.

క్లుప్తంగా చెప్పాలంటే, ఇస్లామ్ పునాదులు ఏకైక దేవుడిని విశ్వసించడంపై నిలబడి ఉన్నాయి. ఆయనే సృష్టికర్త, విశ్వప్రభువు, ఆయన గుణగణాలు సమగ్రమైనవి. ఆయన ఒక్కడే ఆరాధనలకు అర్హుడు. ఇందులోనే మన ఇహపరలోకాల సాఫల్యం ఇమిడి ఉంది.

## విశ్వాసులవైఖరి

ఒక ముస్లిమ్‌గా ఉండాలంటే (అంటే దేవునికి విధేయంగా బతకాలంటే), దేవుడు ఒక్కడే అని విశ్వసించడం అవసరం. అంటే ఆయన ఒక్కడు మాత్రమే సృష్టికర్త, రక్షకుడు, పోషకుడు అన్నీ ఆయనే. అంతేకాదు, ఈ విశ్వాసంతో పాటు ఆయన్ను ఒక్కడిని మాత్రమే ఆరాధించాలని, ఆయన మాత్రమే ఆరాధనలకు అర్హుడని కూడా విశ్వసించాలి. వేరెవ్వరినీ, దేనినీ ఆరాధించరాదు.

ఒకే ఒక్క నిజమైన దేవుడన్న ఈ జ్ఞానాన్ని పొందిన తర్వాత మనిషి నిరంతరం ఆయనలో నమ్మకం ఉంచాలి. సత్యాన్ని తిరస్కరించే ఏ ఒక్క విషయం తనలో లేకుండా జాగ్రత్తపడాలి. ఈ నిజమైన ధార్మిక విశ్వాసం మనిషి హృదయంలో ప్రవేశించిన తర్వాత మనిషి నడవడి, దృక్పథాలు మారిపోతాయి. ప్రవక్త ఈ విషయమై ఇలా అన్నారు: "దైవవిశ్వాసం అనేది హృదయంలో నాటుకుంటుంది. ఆచరణల్లో వ్యక్తం అవుతుంది". ఈ దైవవిశ్వాసం ఫలితాల్లో ముఖ్యమైనది, దేవుని పట్ల కృతజ్ఞతా భావం. ఇదే ఆరాధనల సారం అని చెప్పాలి. ఈ కృతజ్ఞతా భావం చాలా ముఖ్యమైనది. సత్యాన్ని తిరస్కరించే వారిని కాఫిర్ అంటారు. అంటే కృతఘ్నతకు పాల్పడడమే. దైవ విశ్వాసి దేవునికి కృతజ్ఞుడై ఉంటాడు. దేవుడు ప్రసాదించిన వరాలపట్ల కృతజ్ఞత కలిగి ఉంటాడు. దైవం ప్రసాదించిన వాటికి బదులుగా ఎన్ని మంచి పనులు చేసినా సరిపోదని కూడా గుర్తిస్తాడు. అందువల్ల ఎల్లప్పుడు దైవప్రసన్నత కోసమే పరితపిస్తూ ఉంటాడు. ఎల్లప్పుడు దేవుని జ్ఞాపకం చేసుకుంటూ ఉంటాడు. దివ్యఖుర్‌ఆన్ దేవుని గుణగణాలను పదే పదే చెప్పడం ద్వారా ఈ కృతజ్ఞతా భావాన్ని ప్రోత్సహిస్తుంది.

"అల్లాహ్ - ఆయన తప్ప ఆరాధ్య దైవం ఎవ్వడూ లేడు. సకల చరాచర సృష్టికి మూలాధారం అయిన ఆయన సజీవుడు, నిత్యుడు, అనంతుడు. ఆయన నిదురపోడు, ఆయనకు కునుకూ రాదు. భూమ్యాకాశాలలో ఉన్న సమస్తమూ ఆయనదే. ఆయన సమ్ముఖంలో ఆయన అనుజ్ఞ లేకుండా సిఫారసు చెయ్యగలవాడెవ్వడు? ప్రజలముందు ఉన్న దానినీ ఆయన ఎరుగును. వారికి గుప్తంగా ఉన్నదీ ఆయనకు తెలుసు. ఆయన స్వయంగా తెలియజెయ్యాలని అభిలషిస్తే తప్ప ఆయనకున్న జ్ఞాన విశేషాలలోని ఏ విషయమూ వారి గ్రహణ పరిధిలోకి రాదు. ఆయన రాజ్యాధికారం ఆకాశాలనూ భూమినీ పరివేష్టించి ఉన్నది. వాటి సంరక్షణ ఆయనకు ఎంతమాత్రం అలసట కలిగించదు. ఆయన మాత్రమే సర్వాధికుడు, సర్వోత్తముడూను.

**(దివ్యఖుర్‌ఆన్ 2 : 255)**




సంప్రదించండి

**ఇస్లామిక్ ఇన్ఫర్మేషన్ సెంటర్**

IIC

040 - 6832 7832 - Hyderabad

**మౌలిక విషయాలు** తెలుసుకుందాం

**040 - 6832 7832**

Toll Free 1800 572 3000

www.discovertruepath.com

You Tube : DiscoverTruePath

# దేవుడు ఉన్నాడా?

దేవుడున్నాడని నమ్మడానికి అనేక హేతుబద్ధమైన కారణాలున్నాయి. అందులో కొన్ని సాధారణమైన కారణాలను ఇక్కడ ప్రస్తావిస్తున్నాము.

## 1. విశ్వసరళి

మీరు సముద్రపు ఒడ్డున బీచ్‌లో నడుస్తున్నారనుకోండి. ఒక చేతిగడియారం మీకు కనబడింది. ఆ చేతి గడియారం దానికదే అక్కడికి వచ్చిందంటే నమ్ముతారా? ఏదో యాధృచ్ఛికంగా ఆ చేతి గడియారం ఇసుకలోంచి బయటకు వచ్చిందంటే నమ్ముతారా? చేతి గడియారంలో ఉండే చిన్న చిన్న విడిభాగాలన్నీ భూగర్భంలో వాటికవే తయారైపోయి అలా ఉబికి వచ్చేయడం జరగదు కదా. ఆ గడియారాన్ని తయారు చేసిన వారు ఉంటారు. ఆ గడియారం ఖచ్చితమైన సమయం చూపిస్తుంటే దాన్ని తయారు చేసిన వ్యక్తి నిపుణుడని అనుకుంటాం. ఏదో యాధృచ్ఛికంగా ఒక చేతిగడియారం దానికదే ఉనికి లోకి రాదు.

మన భూగ్రహాన్ని చూద్దాం. భూమి ఖచ్చితమైన సమయం ప్రకారం సూర్యుని చుట్టు తిరుగుతుంది. సూర్యోదయం, సూర్యాస్తమయ సమయాలను ఖచ్చితంగా చెప్పవచ్చు. నిపుణుడైన వ్యక్తి తయారు చేస్తేనే చేతిగడియారం ఖచ్చితమైన సమయం చూపిస్తుంది అలాగే, నిపుణుడైన దేవుడు తయారు చేయడం వల్లనే భూమి ఖచ్చితమైన సమయం ప్రకారం సూర్యుని చుట్టు తిరుగుతుంది. ఇదేదో యాధృచ్ఛికంగా జరగడం సాధ్యమా?

అదేవిధంగా, మనలోపల, విశ్వం లోపలఉన్న ఖచ్చితమైన వ్యవస్థ, సూత్రాలు పరిశీలిస్తే ఈ మొత్తం విశ్వానికి ఒక వ్యవస్థాపకుడు, నిర్వాహకుడు ఉన్నాడని విశ్వసించడమే హేతుబద్ధం. ఆ నిర్వాహకుడు, వ్యవస్థాపకుడు దేవుడే, ఆయనే ఈ విశ్వంలో ఒక సరళిని, ఒక వ్యవస్థను ఏర్పాటు చేశాడు.

## 2. విశ్వావిర్భావం

> ఏదైనా ప్రారంభం అంటూ ఉన్న విషయం దానికదే శూన్యం నుంచి రాదని మానవానుభవాలు చెబుతున్నాయి.

ఈ విశ్వానికి ఒక ప్రారంభం ఉందని ఆధునిక విజ్ఞానశాస్త్రం చెబుతోంది. విశ్వం వ్యాకోచిస్తుందని ఇటీవల కనిపెట్టారు. మనం కాలంలో వెనక్కి వెళితే విశ్వం కూడా కుచించుకు పోతూ ఉంటుంది. దీన్ని బట్టి విశ్వానికి ఒక ప్రారంభం ఉందని తెలుస్తోంది. విశ్వం ప్రారంభానికి సంబంధించి మూడు వివరణలు ముందుకు వస్తాయి.

1. విశ్వం శూన్యం నుంచి ఉనికిలోకి రావడం
2. విశ్వం దానికదే తయారు కావడం
3. విశ్వాన్ని ఎవరో తయారు చేయడం

ఇందులో రెండవ వివరణ విషయానికి వస్తే, ఏదైనా గాని ఉనికిలోకి రాకముందు దానికదే ఏదీచేయలేదన్నది సాధారణంగా అర్థమయ్యే విషయం. కాబట్టి ఇక మూడవ వివరణ మాత్రమే హేతుబద్ధమైనది. అత్యున్నతుడైన దైవం ఈ విశ్వాన్ని సృష్టించాడు.

మరి దేవుడిని ఎవరు సృష్టించారని కొందరు అడగవచ్చు. సృష్టించిన వాడికి, సృష్టించబడిన వాటికి మధ్య తేడా ఉంది. సృష్టించినవాడు కూడా సృష్టించబడిన వాడే అయితే, అతడిని సృష్టించినవాడు మరొకడు ఉండాలి. ఇది అనంతంగా సాగుతుంది. అలా జరగడం అసాధ్యం. కాబట్టి సృష్టించినవాడు, సృష్టికర్త కాలాతీతుడు, విశ్వంలోని భౌతిక పదార్థాలన్నింటికి అతీతుడు. దేవుడు ఎల్లప్పుడు ఉంటాడు. ఆయనకు ప్రారంభం లేదు. కాబట్టి దేవుడిని ఎవరు సృష్టించారన్న ప్రశ్న అహేతుకమైనది.

## 3. దేవుని నుంచి మార్గదర్శనం

> దేవుడు మానవాళికి ఒక మార్గదర్శక గ్రంథాన్ని అవతరింపజేస్తే, అందులో దేవుని ఉనికి గురించి స్పష్టమైన ఆధారాలుంటాయని మనం భావిస్తాం.

ఇస్లామీయ దైవగ్రంథం, దివ్యఖుర్‌ఆన్, దేవుని గ్రంథమనడానికి స్పష్టమైన ఆధారాలున్నాయి. ఇలా చెప్పడానికి కొన్ని కారణాలు క్రింద ఇచ్చాము.

- దివ్యఖుర్‌ఆన్ 1400 సంవత్సరాల క్రితం అవతరించింది. ఆ ప్రజలకు తెలియని అనేక వైజ్ఞానిక విషయాలు ఇందులో ఉన్నాయి. ఈ వైజ్ఞానిక విషయాలను ఇటీవలి కాలాల్లో కనిపెట్టడం జరిగింది. ఉదాహరణకు ప్రాణులన్ని నీటితో జన్మించాయన్న విషయం (ఖుర్‌ఆన్ 21 : 30), విశ్వం వ్యాకోచిస్తుందన్న విషయం (ఖుర్‌ఆన్ 51 :47), సూర్యచంద్రుల కక్ష్యల గురించి ప్రస్తావనలు (ఖుర్‌ఆన్ 21 : 33).
- ఆ కాలంలో ప్రజలకు తెలియని ఎన్నో చారిత్రక అంశాలను దివ్యఖుర్‌ఆన్ ప్రస్తావించింది. అంతేకాదు, దివ్యఖుర్‌ఆన్ చెప్పిన భవిష్యవాణులన్నీ నిజమయ్యాయి.
- దివ్యఖుర్‌ఆన్‌లో ఎలాంటి తప్పులు, వైరుధ్యాలు లేవు.
- ఇతర గ్రంథాలు ప్రారంభ రూపంలో నేడు లభించడం లేదు. దివ్యఖుర్‌ఆన్ అలా కాదు. అరబీ భాషలో ఎలా అవతరించిందో అదే విధంగా, ఒక్క పదం కూడా మారకుండా నేటికీ భద్రంగా ఉంది.
- దివ్యఖుర్‌ఆన్‌లోని సరళమైన, స్వచ్ఛమైన, విశ్వజనీనమైన సందేశం మనిషి సహజ విశ్వాసానికి అనుగుణంగా ఉంటుంది.
- దివ్యఖుర్‌ఆన్ ప్రవక్త ముహమ్మద్ (ఆయనకు శాంతి కలుగుగాక)పై అవతరించింది. ఆయన నిరక్ష రాస్యులు. దివ్యఖుర్‌ఆన్ భాషా పరంగా అత్యంత ఉత్కృష్టమైన గ్రంథంగా పేరుపొందింది.

> దివ్యఖుర్‌ఆన్ ప్రత్యేకతలు, మహి మలు, విశిష్టతల్లో అత్యంత ముఖ్యమైనది ఈ గ్రంథం స్వయంగా దేవుని తరఫున అవతరించిన గ్రంథమన్న విషయం.

# దేవుడు ఎవరు?

> "మీ దేవుడు ఒక్కడే. ఆ కరుణామయుడు, ఆ కృపాకరుడు తప్ప మరొక దేవుడు లేడు."
> (ఖుర్‌ఆన్ 2 : 163)

ఒకేఒక్క నిజమైన దేవుని వ్యక్తిగత నామ వాచకం "అల్లాహ్". వేరెవరినీ అల్లాహ్ అని పిలువలేము. ఈ పదానికి బహువచనం కాని లింగభేదం కాని లేదు. తెలుగులో దేవుడు అన్న పదానికి దేవుళ్ళు బహువచనం, దేవత స్త్రీ లింగం అవుతాయి. కాని అల్లాహ్ అన్న అరబీ పదానికి అలా మార్చే అవకాశాలు లేవు. అల్లాహ్ అన్న పదానికి ఉన్న ఈ విశిష్టత ఇస్లామ్ లోని ఏకదైవారాధన విశ్వాసం ఎంత స్వచ్ఛమైనదో తెలియజేస్తుంది.

ఇస్లామ్ ప్రత్యేకత ఏమంటే పరిపూర్ణత, ఔన్నత్యం, ఏకత్వాల విషయంలో ఇస్లామ్ ఎలాంటి రాజీ లేకుండా దేవుడిని నిర్వచిస్తుంది. దేవుడి గుణగణాలకు సంబంధించి ఇస్లామ్ బోధనల్లో ఇదే కనబడుతుంది.

## దేవుడు ఒక్కడే

- దేవునికి భాగస్వాములు లేరు. సమానులు లేరు. ప్రత్యర్థులు లేరు.
- ఆయనకు తండ్రి లేడు, తల్లి లేదు, కుమారులు కుమార్తెలు లేరు.
- అన్ని ఆరాధనలకు ఆయనొక్కడే అర్హుడు.
- అనేక మంది దేవుళ్ళు ఉన్నట్లయితే, దేవుడి అధికారాలు, ఆధిపత్యం తక్కువనుకోవాల్సి వస్తుంది. అనేకమంది దేవుళ్ళ మధ్య ఆధిపత్య పోరుకు దారితీస్తుంది. ఇతర దేవుళ్ళతో రాజీ పడే పరిస్థితి ఉంటుంది. ఈ పరిస్థితి అహేతుకమైనది.

## దేవుడు సర్వశక్తిమంతుడు

- దేవుడికి అన్నింటిపై అధికారం, ఆధిపత్యం ఉంది.
- అన్నీ ఆయనకు అధీనమైనవే, ఆయనపై ఆధారపడినవే.

దైవవిధేయత చూపడం వల్ల ఆయన శక్తి ఏమీ పెరగదు, అవిధేయతకు పాల్పడడం వల్ల ఆయన శక్తి ఏమీ తగ్గదు.

## దేవుడు అత్యున్నతుడు

- దేవుడికన్నా ఉన్నతమైనది, దేవుడితో సమానమైనది ఏదీ లేదు.
- దేవుడి గుణగణాలు ఆయన సృష్టితో పోలినవి కావు.
- ఎవరిలోను లేదా దేనిలోను దేవుని అంశ ఏదీ లేదు. దేవుడు లోపరహితుడు, పరిపూర్ణుడు. మానవ బలహీనతలు, అంటే కొన్ని మతాలు చెబుతున్నట్లు విశ్వాన్ని సృష్టించిన తర్వాత ఏడవరోజు విశ్రాంతి తీసుకోవడం వంటివి ఏవీలేవు.